క్లుప్తంగా

బాధితులకు అండగా ఉంటాం



బాధితులకు సరుకులు అందజేస్తున్న తహసీల్దార్ చంద్రశేఖర్

మంత్రాలయం రూరల్: మండలంలోని మాధవరం గ్రామంలో గురువారం ప్రమాదవశాత్తు నిప్పంటుకుని బొగ్గుల నరసన్న గుడిసెలు దగ్ధమైన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న తహసీల్దార్ చంద్రశేఖర్ రూ.4 వేల నగదు, నిత్యావసర సరుకులు శుక్రవారం అందజేశారు. బాధితులకు ఖాళీ స్థలంలో ప్రభుత్వం ద్వారా రెండు ఇళ్లు మంజూరు చేసేలా చర్యలు తీసుకుని అండగా ఉంటామని హామీనిచ్చారు. ఎస్ఐ కిరణ్, ఇన్‌చార్జ్ ఆర్ఐ ఆనంద్ ఉన్నారు.

ముగిసిన పంచాయతీ వేలాలు

మంత్రాలయం రూరల్: మంత్రాలయం గ్రామ పంచాయతీ దినసరి, వారపు సంత మార్కెట్ వేలాలు శుక్రవారం ఎంపీడీఓ ప్రభావతి, సర్పంచ్ తెల్లబండ్లభీమయ్య ఆధ్వర్యంలో ముగిశాయి. వారపు సంతమార్కెట్ రూ.42 వేలకు రాంపోగు ఆనక్, దినసరిమార్కెట్ రూ.81 వేలకు ఎం.నరసయ్య కైవసం చేసుకున్నారు. గతేడాది కంటే ఈ ఏడాది పంచాయతీకి రూ 50,800 ఆదాయం వచ్చిందని సర్పంచ్ వివరించారు. ఈవో నాగరాజు,ఉపసర్పంచ్ హోటల్ పరమేష్ ఉన్నారు.

కర్ణాటక మద్యం తరలిస్తే చర్యలు



వాహనదారుడికి సూచనలిస్తున్న సీఐ శ్రీనివాసులు

మంత్రాలయం రూరల్: కర్ణాటక నుంచి రాష్ట్రంలోకి కర్ణాటక మద్యం రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని మంత్రాలయం సీఐ శ్రీనివాసులు తెలిపారు. మంత్రాలయం గ్రామ శివారులోని అయ్యప్ప స్వామి గుడి వద్ద శుక్రవారం సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేపట్టారు. పలు వాహనాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించి రికార్డులు సక్రమంగా లేని వాటికి జరిమానా విధించారు. కర్ణాటక మద్యం అక్రమ రవాణా సమాచారం సీఐ 9121101151, ఎస్ఐ 9121101152 సెల్ నంబర్లకు సమాచారమిస్తే వివరాలు గోప్యంగా ఉంచుతామని చెప్పారు. అనంతరం రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై వాహనదారులకు అవగాహన కల్పించారు.


వేలంతో పంచాయతీకి ఆదాయం

కౌతాళం: మండలంలోని హాల్వి పంచాయతీలో వివిధ పన్నుల వసూలుకు సర్పంచ్ క్రాంతి, కార్యదర్శి అబ్దుల్‌కరీం ఆధ్వర్యంలో శుక్రవారం వేలం నిర్వహించారు. వీటితో పంచాయతీకి ఆదాయం పెరిగింది. గతేడాది కన్నా రూ.1.45లక్షలు అధికంగా సమకూరిందని అధికారులు తెలిపారు. బండిమెట్ట రూ.5,92,000కు చంద్రశేఖర్ దక్కించుకోగా దక్కించుకోగా, వారపు సంత మార్కెట్‌ను గతేడాది మాదిరిగానే రూ.15,200కు చాకలి బస్సప్ప దక్కించుకున్నట్లు కార్యదర్శి తెలిపారు.

లోకేష్‌కు వాల్మీకులు బుద్ధి చెప్పాలి

కౌతాళం: వాల్మీకి మహర్షి విగ్రహానికి పూలమాల వేయడానికి నిరాకరించిన లోకేష్‌కు వాల్మీకులు తగిన బుద్ధి చెప్పాలని వాల్మీకి సంఘం రాష్ట్ర నాయకుడు, ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తోవి నర్సప్ప పేర్కొన్నారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ యువగళం పాదయాత్రలో సోమందేపల్లిలోవాల్మీకి మహర్షి విగ్రహానికి పూలమాల వేయడానికి నిరాకరించిన లోకేష్‌కు 2024లో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో వాల్మీకులు ఓటు ద్వారా బుద్ధి చెప్పాలని సంఘస్తులకు పిలుపునిచ్చారు. వాల్మీకుల్ని ఎస్టీ జాబితాలో చేర్చడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత నెల 24న అసెంబ్లీలో తీర్మానం కూడా చేశారని గుర్తు చేశారు. ఇప్పటికైనా తెలుగుదేశం భజన చేస్తున్న వాల్మీకులు మారాలని కోరారు.

వాల్మీకి విగ్రహం ఏర్పాటు



వాల్మీకి విగ్రహాన్ని ప్రతిష్ఠించిన దృశ్యం

కౌతాళం: మండలలోని పొదలకుంట గ్రామంలో వాల్మీకి విగ్రహాన్ని శుక్రవారం ప్రతిష్ఠించారు. తెల్లవారుజామున సుప్రభాతసేవ, మంగళహారతి వంటి పూజల అనంతరం హాల్వి మఠం పీఠాధిపతి మహంత్‌స్వామి పూజలు నిర్వహించిన తర్వాత వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో విగ్రహాన్ని ప్రతిష్ఠించారు.

☛ ఎమ్మిగనూరు మండలం గుడికంబాల గ్రామానికి చెందిన అరుణ్‌పాండు..ఈ ఏడాది జనవరి 26న సిరిగిప్ప నుంచి ఆదోని నుంచి బైక్‌పై వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఇరవై రోజుల్లో పెళ్లి జరగాల్సి ఉండగా.. ప్రమాదంలో ప్రాణాలు వదిలాడు. కుమారుడి పెళ్లి ఘనంగా చేయాలని, కోడలిని చూడాలనే ఆశలు అడియాశలయ్యాయని సంఘటనా స్థలంలో తల్లిదండ్రులు, బంధువులు రోధిస్తున్న తీరు స్థానికులను కలచివేసింది.

☛ గత నెల 3న ఆదోని పట్టణంలోని ఎమ్మిగనూరు బైపాస్ రోడ్డులో రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో హెచ్.కైరవాడికి చెందిన హరి (24), ఆస్పరి మండలం చిరుమాన్‌దొడ్డి గ్రామానికి చెందిన బాలమద్ది (26) మృత్యువాత పడ్డారు. ఆరేకల్‌లో ఉరుసు చూసుకొని ఒకరు, అదే ఉరుసుకు కోసం వెళ్తూ మరొకరు ఎదురెదురుగా వేగంగా ఢీకొనడంతో ప్రమాదం చోటు చేసుకుంది. కాగా..హరికి ఏడు నెలల క్రితమే వివాహమైంది. బాలమద్దికి భార్య, ఇద్దరు చిన్నారులు. తమ పరిస్థితి ఏంటని భార్య, పిల్లలు,తల్లిదండ్రులు రోధించడం కంట తడి పెట్టించింది. ఇలా.. ఈ రెండు ఘనటలే కాదు.. నిర్లక్ష్యం, అతివేగం, నిబంధనలు పాటించకుండా బైక్‌లు నడుపుతూ యువత ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయి కుటుంబ సభ్యులను దుఃఖసాగరంలో ముంచుతున్నారు.

ప్రమాదాల్లో కరుగుతున్న కలలు

- గారాబంతో పిల్లలకు బైకులు కొనిస్తున్న తల్లిదండ్రులు
- అతివేగంతో ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్న యువకులు
- భద్రతా నియమాలపై అవగాహన ఉండాలంటున్న పోలీసు, ఆర్టీఓ అధికారులు



బైకు ప్రమాదంలో మృతిచెందిన యువకుడు (ఫైల్)

ఆదోని అర్బన్ : తమ పిల్లలను ఉన్నత స్థానాల్లో చూడాలని, వారు కళ్ల ముందు తిరుగుతుంటే ఆనందంతో, గారాబంగా పెంచుకున్న పిల్లలు అడిగిందే తడవుగా కోరిన మోడల్ బైక్‌లను తల్లిదండ్రులు కొనిస్తున్నారు. వయస్సు, స్నేహితులు, మాధ్యమాల ప్రభావంతో అతి వేగం, నిర్లక్ష్యంగా, ట్రిపుల్ రైడింగ్, మద్యం సేవించి నడపడం వంటి వాటితో ప్రమాదాల బారిన పడుతున్నారు. ఉన్నత శిఖరాలకు బాటలు వేసుకోవాల్సిన తరుణంలో ప్రమాదాల్లో విగతజీవులుగా మారిపోతున్నారు. మరికొందరు అవిటి వారిగా మిగిలిపోతుండటంతో ఆ కుటుంబ సభ్యుల వేదన వర్ణనాతీతం.

యువతే అధికం..

ఇటీవల కాలంలో చోటు చేసుకుంటున్న రోడ్డు ప్రమాదాల్లో 30 యేళ్ల లోపు వారే ఎక్కువ శాతం మృత్యువాత పడుతున్నారని పోలీసు, ఆర్టీఓ అధికారులు చెబుతున్నారు. ఉద్యోగాలు చేసి స్థిరపడాల్సిన వయస్సులో కొందరు, కొన్ని రోజుల్లోనే పెళ్లి చేసుకుని ఇంటి వారు కావాల్సిన వారు, కొత్తగా పెళ్లయిన వారు ఇందులో ఉంటున్నారు. వారి అనాలోచిత, తాత్కాలిక ఆనందాల కారణంగా తల్లిదండ్రులకు పెళ్లి కావలసిన, భార్యలకు తీరని శోకాన్ని మిగిలిస్తున్నారు. జిల్లాలో 2020–21లో 1,185 రోడ్డు ప్రమాదాలు జరగగా, 620 మంది మరణించారు. 1,428 మంది క్షతగాత్రులుగా మిగిలారు. 2021–22 నవంబర్ వరకు 850 రోడ్డు ప్రమాదాలు చోటు చేసు కోగా, 400 మంది మృతిచెందారు. 800 మంది క్షతగాత్రులుగా మారారు.సబ్ డివిజన్ పరిధిలోని 2022 నవంబర్ నుంచి ఈ యేడాది జనవరి వరకు 110 రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకోగా, అందులో 120 మృతిచెందారు. 71 మంది గాయాలపాలయ్యారు. 118 చిన్న చిన్న రోడ్డు ప్రమాదాల్లో 218 మంది గాయాల పాలయ్యారు. వీటన్నింటిలో యువతే అధికంగా ఉండటం ఆందోళన కలిగించే విషయం.

గారాబమే ముంచుతుందా..

ప్రస్తుతం పిల్లలను తల్లిదండ్రులు గారాబంగా పెంచుతున్నారు. ఈ క్రమంలో తమ పిల్లలు అడిగిందే తడవుగా మార్కెట్‌లోకి కొత్తగా వచ్చిన, రాబోతున్న మోడల్ బైక్‌లను కొనిస్తున్నారు. అయితే అదే సమయంలో వారికి జాగ్రత్తలు, నిబంధనలు, పర్యావసానాల గురించి వివరించకపోతుండటంతో ప్రమాదాలు కొని తెచ్చుకుంటున్నారు. ముఖ్యంగా రహదారి నిబంధనలు పట్టించుకోకపోవడం, నిర్లక్ష్యం, అతి వేగం, మద్యం సేవించడం ప్రమాదాలకు ముఖ్యమైన కారణాలుగా నిలుస్తున్నాయి. వాహనాలను సక్రమంగా నడపకపోతే ఎలాంటి పరిణామాలు ఎదురవుతాయో తల్లిదండ్రులు తమ పిల్లలకు వివరించాలని పోలీసు, రవాణాశాఖ అధికారులు కోరుతున్నారు. ప్రమాదాలబారిన పడి నష్టపోయిన కుటుంబాల వ్యథను గుర్తించైనా మారాలని సూచిస్తున్నారు.

వాహనదారులకు సూచనలు..

1. వాహనదారులు తమ కుటుంబ సభ్యులను దృష్టిలో పెట్టుకొని వాహనాలను నడపాలి. ఏదైనా ప్రమాదం జరిగితే కుటుంబ సభ్యులు రోడ్డు పాలవుతారనేది గుర్తుంచుకోవాలి. తల్లిదండ్రులు పిల్లల సంతోషం కోసం వాహనాలను కొనిచ్చినా.. నిబంధనలు, సూచనలు చేయకపోతే ప్రమాదం జరిగితే శోకసంద్రంలో మునిగిపోవాల్సి వస్తుంది.
2. యువత ట్రిపుల్ రైడింగ్, అధిక వేగం, రేసింగ్ లాంటివి మానుకోవాలి.
3. మద్యం సేవించి వాహనాలను నడపరాదు.
4. వాహనాలు నడిపే సమయంలో.. రాత్రివేళల్లో నిద్ర వస్తే ఓ చోట వాహనాన్ని ఆపి నిద్రించాలి.

కనీస జాగ్రత్తలు తప్పనిసరి



ఇటీవల అధికంగా యువత రోడ్డు ప్రమాదాలబారిన పడుతున్నారు. పిల్లలకు లక్షలు పోసి బైకులు కొనిచ్చేటప్పుడు తల్లిదండ్రులు కనీస జాగ్రత్తలు తీసుకోవాలి. అతి గారాబంతో అడిగినవన్నీ కొనిస్తే భవిష్యత్‌లో బాధపడక తప్పదు. యువకులు బైకు నడిపే సమయంలో హెల్మెట్ పెట్టుకునేలా చూసుకోవాలి. అతివేగం వద్దని స్పష్టంగా చెప్పాలి. డ్రైవింగ్ లైసెన్సు ఉంటే వాహనం నడిపేందుకు తల్లిదండ్రులు అనుమతినివ్వాలి. మైనర్లు ప్రమాదానికి గురైతే వారికి బైకు ఇచ్చిన తల్లిదండ్రులే దోషులవుతారు. ప్రాణాలు కోల్పోవడం, జీవితాంతం అవిటి వారిగా మిగిలిపోయే దుస్థితి తెచ్చుకోవద్దు.

– వినోద్‌కుమార్, డీఎస్పీ

ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్నాం



కళాశాల, పాఠశాలల్లో విద్యార్థులు, యువతకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్నాం. ఆటో కార్మికులు, పెద్ద వాహనాల డ్రైవర్‌లకు కూడా అవగాహన కల్పిస్తున్నాం. రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను బ్లాక్ స్పాట్‌గా గుర్తించి, ప్రమాద సూచికలు ఏర్పాటు చేశాం. ఎక్కువ శాతం యువకులే రోడ్డు ప్రమాదాల్లో మృత్యువాత పడుతున్నారు. మైనర్‌లకు బైకులు కొనివ్వరాదు. పూర్తిగా రోడ్డుపై అవగాహన, డ్రైవింగ్ లైసెన్సు ఉంటేనే వాహనం నడపాలి. లేదంటే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తాం.

– శివారెడ్డి, ఆదోని ఆర్టీఓ

ఇంకుడుగుంతలు వేగంగా పూర్తి చేయండి

ఆదోని రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాలు–పేదలందరికీ ఇల్లు కార్యక్రమంలో భాగంగా అన్ని గ్రామాల్లో జగనన్న కాలనీల్లో మ్యాజిక్ సోప్ కిట్ల (ఇంకుడు గుంతలు)ను వేగంగా నిర్మించాలని ఎంపీడీఓ గీతావాణి సూచించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో హౌసింగ్ అధికారులు, టెక్నికల్ అసిస్టెంట్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. జగనన్న కాలనీల్లో చేపడుతున్న ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేసి ప్రతి ఇంటి వద్ద కిచెన్ వాటర్, వాషింగ్ వాటర్‌ను ఇంకుడు గుంతల్లోకి మళ్లించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మూడు అడుగులు లోతు, మూడు అడుగుల వెడల్పు తవ్వి రింగులు వేసి ఆ నీరు భూమిలోకి ఇంకిపోయేలా నిర్మాణాలు చేపట్టాలని చెప్పారు. అలాగే వర్షపునీరు కూడా అందులోకే వెళ్లేలా చూడాలన్నారు. హౌసింగ్ డీఈ రవికుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగమల్లయ్య, హౌసింగ్ ఏఈలు, వర్క్ ఇన్‌స్పెక్టర్‌లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

శ్రీ మఠంలో కర్ణాటక హైకోర్టు జడ్జి



మంత్రాలయం చేరుకున్న హైకోర్టు జడ్జి బసవరాజు

మంత్రాలయం రూరల్: శ్రీ రాఘవేంద్రస్వామిని దర్శించుకునేందుకు కర్ణాటక హైకోర్టు జడ్జి బసవరాజు శుక్రవారం రాత్రి మంత్రాలయం వచ్చారు. వీరు ముందుగా గ్రామ దేవత మంచాలమ్మ, శ్రీ రాఘవేంద్రస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. శనివారం ఉదయం కుటుంట సభ్యులతో కలిసి మరో మారు స్వామి వారిని దర్శించుకోనున్నారు. ఎస్ఐ వేణుగోపాల్‌రాజు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

చలివేంద్రం ప్రారంభం

కౌతాళం: స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో శుక్రవారం సీఐటీయూ, ఆటో డ్రైవర్ల సంఘం ఆధ్వర్యంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మల్లయ్య, పోలీసులు చలివేంద్రాన్ని ప్రారంభించారు. మల్లయ్య మాట్లాడుతూ ప్రయాణికుల రద్దీతో ఉండే బస్టాండ్‌లో ప్రయాణికులకు నాగరాజు, ఈరన్న, సుధా చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.

విద్యార్థులకు అభినందన

ఆదోని అర్బన్ : నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్‌నకు ఎంపికైన నెహ్రూ మెమోరియల్ మున్సిపల్ పాఠశాల విద్యార్థులను శుక్రవారం ఎస్టీయూ నాయకులు అభినందించి బహుమతులు అందజేశారు. నాయకులు నాగరాజు, లోక్యనాయక్, రవి, వీరచంద్రయాదవ్, హెచ్ఎం అలీంసిద్దిఖీ, ఉపాధ్యాయులు ప్రహ్లాద్ పాల్గొన్నారు.

వేసవిలో జాగ్రత్తగా ఉండాలి

ఆదోని అర్బన్ : వేసవిలో వచ్చే జబ్బుల పట్ల విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలని డాక్టర్ గోపీనాథ్ సూచించారు. శుక్రవారం స్థానిక భాష్యం పాఠశాలలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ వేసవిలో నీరు ఎక్కువగా తాగాలని, ఎండలో తిరగరాదని చెప్పారు. మజ్జిగ, పెరుగు,నీరు పుష్కలంగా ఉండే పళ్లు, పళ్లరసాలు, కూరగాయలు తీసుకోవాలన్నారు. డాక్టర్ కృష్ణమూర్తి, ధర్మారెడ్డి, ప్రసాదరావు, గోవిందరావు, ప్రిన్సిపాల్ సదాశివ పాల్గొన్నారు.

వేద పాఠశాల విద్యార్థులకు అన్నదానం

ఆదోని అర్బన్ : మండలంలోని సంతెకూడ్లూరు గ్రామ సమీపంలోనున్న జంగమ వేదమ పాఠశాలలోని విద్యార్థులకు శుక్రవారం అన్నదానం చేశారు. అల్కూరు మఠం శ్రీ సిద్ధయ్యస్వామి సంస్మరణ దినోత్సవం సందర్భంగా డివిజన్ జంగమ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గురునాథయ్య, విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు బసవన్నగౌడ్, ఏపీటీఎఫ్ రాష్ట్ర నాయకుడు రఘురామయ్య, వీరశైవ సంఘం నాయకులు శివరుద్రప్ప, వీరేష్, బళ్లారి మల్లి, ప్రకాష్ సిద్ధయ్యస్వామి చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం సిద్ధయ్యస్వామి కవితలను ఆవిష్కరించారు.

మహిళా సంక్షేమమే లక్ష్యం



ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డికి స్వాగతం పలుకుతున్న మహిళలు



సమావేశానికి హాజరైన డ్వాక్రా మహిళలు

ఆదోని టౌన్ : మహిళల సంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పథకాలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి తెలిపారు. మహిళలను ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా అభివృద్ధి చేస్తూ మహారాణులుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వం ఉద్దేశమన్నారు. శుక్రవారం పట్టణంలోని శక్తిగుడి ఏరియా జీవేశ్వర స్కూల్ ఆవరణలో 1 నుంచి 17 వార్డుల పరిధిలో మూడో విడత వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. 42 వార్డుల పరిధిలోని పొదుపు సంఘాల మహిళలు, ఆర్‌పీలు, వార్డు కమిటీల సభ్యులు పాల్గొన్నారు. ముందుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ..చంద్రబాబునాయుడు గిమ్మిక్కులు చేయడం మానుకోవాలన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడే నేత జగనన్న అని కొనియాడారు. నవరత్నాల్లో భాగంగా మహిళల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో ప్రతి మహిళను భాగస్వాములుగా చేస్తూ వారిని ఆర్థికంగా అభివృద్ధి చేస్తోందన్నారు. 14 యేళ్ల టీడీపీ పాలనలో ఇంటి యజమానులు, పురుషులకు ఏ పథకమైనా వర్తించేదని, జగనన్న మాత్రం మహిళల పేరుతో పథకాలు అందజేసి, కుటుంబ అభివృద్ధిలో వారి భాగస్వామ్యం పెరిగేలా చేశారన్నారు. అలాగే కాంట్రాక్టులు, నామినేటెడ్ పోస్టుల భర్తీలో వారికే అధికంగా కేటాయించి వారిని రాజకీయంగా ముందుకు తీసుకెళ్తున్నారని, గుర్తింపునిచ్చారని కొనియాడారు. అనంతరం మూడో విడత వైఎస్సార్ ఆసరా పథకం కింద పొదుపు సంఘాల మహిళలకు రూ.9.17 కోట్ల మెగా చెక్కు అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు దేవా, లింగాయతీ కార్పొరేషన్ డైరెక్టర్ మంజుల, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పోలకల్ రేణుక, నాయకులు మస్తాన్, సలీం, ధర్మన్న, కిషోర్, సురేష్, రాజేశ్వర్‌రెడ్డి, బాలాజీ, రమేష్‌యాదవ్, రఘునాథ్‌రెడ్డి, సుధాకర్, మున్సిపల్ మేనేజర్ భాస్కర్‌రెడ్డి, సీఎంఓ షమీనా, సీఓలు వీరారెడ్డి, అమిద్‌బాషా, రహమాన్, రహీం పాల్గొన్నారు.

2న చలో కర్నూలు

ఆదోని టౌన్ : ఈనెల 2వ తేదీన చలో వాల్మీకి కర్నూలు కార్యక్రమాన్ని చేపడుతున్నామని, వాల్మీకులు పాల్గొని జయప్రదం చేయాలని వాల్మీకి పోరాట సమితి రాష్ట్ర నాయకులు రాంభీంనాయుడు, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు దేవా పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్నికల ముందు వాల్మీకులకు ఇచ్చిన హామీని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చారని కొనియాడారు. నాయకులు వెంకన్న, సుధాకర్, మున్సిపల్ చైర్‌పర్సన్ శాంత, సింహం నాగేంద్ర, లక్ష్మీనారాయణ, లక్ష్మయ్య, లోకేష్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



విద్యార్థుల ఆట,పాటలు

ఉత్తమ విద్యార్థులుగా ఎదగాలి

కౌతాళం: ప్రతి విద్యార్థి ఉత్తమ విద్యార్థిగా ఎదగాలని హెచ్ఎం గురురాజ శెట్టి, పీఎంసీ చైర్మన్ ఈశప్పగౌడ్ కోరారు. మండలంలోని నదిచాగి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవ వేడుకలతో పాటు సర్వసతీ పూజను శుక్రవారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ పాఠశాల ప్రారంభమై 110 సంవత్సరాలు పూర్తి కావడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఆట, పాటలు ఆకట్టుకున్నాయి. సీఆర్పీ రామన్న, మహాదేవ, బండయ్యస్వామి,గ్రామపెద్దలు పాల్గొన్నారు.

కబీంద్రతీర్థుల ఆరాధన

మంత్రాలయం రూరల్: కర్ణాటక రాష్ట్రంలోని నవబృందావనంలో వెలసిన పూర్వపు పీఠాధిపతి కబీంద్రతీర్థుల ఉత్తరరాధన వేడుకలను పీఠాధిపతి శ్రీ సుభుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ముందుగా మూలరాముల పూజ అనంతరం బృందావనానికి ఫల,పుష్ప, క్షీరాభిషేకాలు చేపట్టారు. ఉత్సవాలకు భక్తులు తరలివచ్చారు.



బృందావనానికి హారతులిస్తున్న పీఠాధిపతి శ్రీ సుభుధేంద్రతీర్థులు



భక్తుల సమక్షంలో కొనసాగుతున్న రథోత్సవం



మురవణిలో భక్తుల మధ్య రథోత్సవం

రమణీయం.. రథోత్సవం



బదినేహాల్‌లో రథోత్సవం జరుగుతున్న దృశ్యం

కౌతాళం: మండలంలోని సుళేకేరి గ్రామంలో వెలసిన బుడుములదొడ్డి అంజనేయ స్వామి రథోత్సవం శుక్రవారం రమణీయంగా సాగింది. ఆనవాయితీలో భాగంగా శ్రీరామనవమి మరుసటి రోజు రథోత్సవం నిర్వహిస్తారు. ఉదయం నుంచే కార్యక్రమాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ముందుగా బుడుములదొడ్డి ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆలయంలోని సీతారాముల కల్యాణం అనంతరం ఉత్సవమూర్తులను రథంపై అధిష్ఠించి పూజలు చేపట్టారు.అనంతరం భక్తుల జయ జయ ధ్వానాల మధ్య రథాన్ని లాగారు. వేడుకను తిలకించేందుకు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు తరలివచ్చారు. జాతర సందర్భంగా స్వామి దేవాలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా ఆలంకరించారు.

పెద్దకడబూరు : మండలంలోని హెచ్.మురవణి గ్రామంలో వెలసిన శ్రీ సీతారామాంజనేయస్వామి రథోత్సవం గ్రామస్తులు శుక్రవారం కనుల పండువగా నిర్వహించుకున్నారు. ఉదయం ఆలయ అర్చకులు స్వామివారికి కుంకుమార్చన, అష్టోత్తర శతనామావళి, పుష్పాభిషేకం, పాలాభిషేకం, పంచామృతాభిషేకం వంటి ప్రత్యేక పూజలు నిర్వహించి మహా మంగళహారతులు చేపట్టారు. అనంతరం గ్రామ ప్రజలు పిండి వంటలతో నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం ముందుగా రథం ముందు శాంతి హోమం జరిపించారు. అనంతరం కిందిగేరి వేమారెడ్డి ఇంటినుంచి కళశం, పైగేరి ఓంకారప్ప ఇంటి నుంచి కుంభాన్ని ఊరేగింపుగా రథం దగ్గరకు తీసుకొచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవమూర్తులను రథంపై అధిష్ఠింపజేసి అశేష భక్త జనులు జై శ్రీరాం అని నినదిస్తుండగా.. రథాన్ని బసవన్న గుడి కట్టవరకు లాగి యథాస్థానానికి చేర్చారు.

కౌతాళం: మండలంలోని బదినేహల్ గ్రామంలో వెలసిన శ్రీమల్లికార్జున స్వామి వారి రథోత్సవం శుక్రవారం కనుల పండుగగా సాగింది. జాతరను తిలకించేందుకు వేలాది సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ముందుగా ఆలయంలో మల్లికార్జున స్వామి వారికి ప్రత్యేక పూజలు చేపట్టి మహామంగళ హారతులు ఇచ్చారు. సాయంత్రం గ్రామానికి చెందిన హరిచంద్రరెడ్డి వంశీయుల కుటుంబం నుంచి మొదటి కుంభంతో రథం వద్దకు చేరుకొని పూజలు చేశారు. అనంతరం రథాన్ని ముందుకు లాగారు. కార్యక్రమాన్ని తిలకించేందుకు చుట్టూ పక్కల గ్రామాల ప్రజలు వేలాదిగా తరలివచ్చారు. వైఎస్సార్‌సీపీ నాయకులు వీరభద్రగౌడ్, విశ్వనాథ్‌గౌడ్, నాకేష్‌రెడ్డి, రవిరెడ్డి పాల్గొన్నారు.

న్యూటన్ వర్ధంతి



న్యూటన్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

కోసిగి: సైన్స్‌ను విజ్ఞాన శాస్త్రంగా అభివృద్ధి చేసిన మహనీయుడు ఐజాక్ న్యూటన్ అని దుద్ది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం పి.నారాయణ, జనవిజ్ఞాన వేదిక అధ్యక్షుడు కె.శంకరయ్య పేర్కొన్నారు. ఐజాక్ న్యూటన్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం దుద్ది పాఠశాలలో ఆయన చిత్ర పటానికి ఉపాధ్యాయులతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్యామల, వెంకటలక్ష్మి, కళావతి, మైథిలి, కౌసర్, రాజీ, భీమేష్, వెంకటేష్, నవీన్ కుమార్ రెడ్డి, రాజేంద్రప్రసాద్, జగదీష్, విద్యార్థులు పాల్గొన్నారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటలక్ష్మి

ఆదోని అర్బన్ : పదో తరగతి విద్యార్థులు బాగా చదివి వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని తహసీల్దార్ వెంకటలక్ష్మి, ఎంపీడీఓ గీతావాణి, ఎంఈఓ శివరాములు సూచించారు. శుక్రవారం స్థానిక ఆర్‌ఆర్‌లేబర్ కాలనీలోని మున్సిపల్ ఉన్నత పాఠశాల హెచ్ఎం రమేష్‌నాయుడు ఆధ్వర్యంలో వార్షికోత్సవం జరిగింది. ముందుగా సరస్వతి పూజ అనంతరం పరీక్ష సామగ్రిని శీన విద్యార్థులకు అందజేశారు.

నేడు బండలాగుడు పోటీలు

చిప్పగిరి: మండలంలోని నేమకల్లు గ్రామంలో శ్రీరామనవమి ఉత్సవాలను పురస్కరించుకుని శనివారం రాష్ట్రస్థాయి వృషభాల రాతి దూళం లాగే పోటీలు నిర్వహించనున్నట్లు సర్పంచ్ ప్రేమ్‌కుమార్, గ్రామ పెద్దలు తెలిపారు. వారు మాట్లాడుతూ పోటీలలో విజేతలుగా నిలిచిన ఎద్దుల యజమానులకు వరుసగా రూ.30 వేలు, రూ.25 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు నగదు బహుమతులను దాతల సహకారంతో అందించనున్నట్లు వెల్లడించారు.